# తొలి అక్షరం

చైర్మెన్ & చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

తెలుగు దిన పత్రిక

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 02 సంచిక - 28 పేజీలు - 6 ఆదివారం 22 డిసెంబర్ 2024


## మర్రి జనార్దన్‌రెడ్డి ఇంట్లో విషాదం

**తొలి అక్షరం/నాగర్‌కర్నూల్, డిసెంబర్ 21:** నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఇంట్లో విషాదం నెలకొన్నది. ఆయన తండ్రి మర్రి జంగిరెడ్డి (80) తుది శ్వాస విడిచారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన జూబ్లీహిల్స్‌లోని అపోలో దవాఖానలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో శనివారం తెల్లవారుజామున మృతిచెందారు. దీంతో ఆయన భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి వారి స్వగ్రామం తిమ్మాజీపేట మండలం నేరేళ్లపల్లికి తీసువెళ్లనున్నారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు.

## కువైట్ చేరుకున్న ప్రధాని మోదీ

● భారతీయ సాంప్రదాయంలో ఘన స్వాగతం



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,డిసెంబర్ 21:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల అధికారిక పర్యటన కోసం శనివారం కువైట్ చేరుకున్నారు. ఈ పర్యటనలో ప్రధాని మోదీ గల్ఫ్ దేశాల నేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. కువైట్ చేరుకున్న వెంటనే ప్రవాస భారతీయులతో ప్రధాని మోదీ సమావేశమయ్యారు. అనంతరం కువైట్ సిటీలో మాజీ ఐఎఫ్ఎస్ అధికారి 101 ఏళ్ల మంగళ్ సేన్ హండాను కూడా ప్రధాని మోదీ కలిశారు.ప్రధాని మోదీ కువైట్ రాకతో అక్కడ నివసిస్తున్న ప్రవాసాంధ్రుల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రధాని నరేంద్ర మోదీ రాక గర్వించదగిన క్షణం. ఇది భారతీయుల పెద్ద విజయం అంటూ ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలియజేశారు. 43 ఏళ్ల తర్వాత భారత ప్రధాని కువైట్‌లో పర్యటించడం విశేషం. గతంలో ఇందిరా గాంధీ కువైట్‌లో పర్యటించారు. భారతదేశం- కువైట్ మధ్య సంబంధాలు స్నేహపూర్వకంగా ఉన్నాయి. రక్షణ, భద్రతా సహకారాన్ని బలోపేతం చేయడం ఈ పర్యటనలో ప్రధానాంశంగా ఉంటుందని భారత అధికారులు తెలిపారు. ద్వైపాక్షిక పెట్టుబడి ఒప్పందం, రక్షణ సహకార ఒప్పందం కోసం కువైట్‌తో చర్చలు జరుగుతున్నాయని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

## పుష్పా-2 ఘటన ఎంతో కలిచివేసింది...

- కనీసం మానవత్వం చూపని సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు
- సమాజం ఎటువైపు పోతుంది..
- హీరోలంటే.. తెరపైన కాదు.. నిజజీవితంలో చూపాలి
- హీరోలను అరెస్టు చేయకుండా ఏమైనా చట్టాలు ఉన్నాయా..?
- ఉంటే చెప్పండి.. అలా నడుచుకుంటాం :
- తల్లి చనిపోయి.. కుమారుడు ఆస్పత్రిలో ఉంటే కనీసం ఒక్కరూ చూడలేదు
- అసెంబ్లీలో భావోద్వేగానికి గురైన సీఎం రేవంత్‌రెడ్డి



**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్ 21:** కొన్నికొన్ని సంఘటనలు చూస్తే మనసు చలించిపోతుందని, అసలు సమాజం ఎటువైపు పోతుందని బాధేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి శనివారం జరిగిన అసెంబ్లీలో సమావేశంలో తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. అసెంబ్లీ సమావేశంలో భాగంగా పుష్పా-2 సినిమా బెన్‌ఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్‌లో జరిగిన ప్రస్తావన సందర్భంగా సీఎం మాట్లాడారు. పుష్పా-2కు సంబంధించి టిక్కెట ధరలు విషయంలో, బెన్‌ఫిట్ షోకు సంబంధించి ప్రభుత్వమే అనుమతి ఇచ్చిందని సీఎం గుర్తు చేశారు. కానీ బెన్‌ఫిట్ షోకు వస్తే జనం కిక్కిరిసి ఉంటారని, కనీసం జ్ఞానం లేకుండా వివరాలు 2లో



- గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌ది
- వివిధ కొర్రీలతో రైతులకు ఎగమానం పెట్టేందుకు కాంగ్రెస్ కుట్ర : కేటీఆర్

## రైతు బంధు ఇస్తే... అసలు చర్చ ఎందుకు..?

**తొలిఅక్షరం/హైదరాబాద్,డిసెంబర్ 21:** రైతులకు ఇచ్చే రైతు బంధ పథకంలో వివిధ కారణాలతో ఎగనామం పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తుందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకం లబ్ధిదారులకు ఉన్నది ఉన్నట్టు ఇచ్చే ఉద్దేశం ఉంటే రైతుబంధుపై చర్చ ఎందుకు..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ నిలదీశారు. రైతుభరోసాపై ప్రభుత్వం చేపట్టిన స్వల్పకాలిక చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. గత ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించి రూ. 73 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. మేం ఒక దఫా మాత్రమే చెల్లించామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చెప్పడం అభినందనీయమని పేర్కొన్నారు. రైతుబంధు రూ. 21,283 కోట్ల దుర్వినియోగం జరిగిందని వివరాలు 2లో

## రైతు భరోసాపై తుది నిర్ణయం తీసుకోలేదు

● స్వల్పకాలిక చర్చలో మంత్రి తుమ్మల వెల్లడి



**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్ 21:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. 'మేం ఇచ్చిన నోట్‌లో రైతు భరోసాపై ఏమీ చెప్పలేదు. గత ప్రభుత్వంలో జరిగిన విధివిధానాలే సభ ముందు ఉంచాం. భారాస ఏది చెబితే.. అది అమలు చేయాలనే ఆలోచన వారికి ఉంది. ఏ పంటకు ఎంత ఇస్తామనేది ఇంకా నిర్ణయించలేదు. సభలో సభ్యుల సూచనల తర్వాతే నిర్ణయిస్తాం. పత్తి, చెరకుకు ఏం చేయాలనేది సభ్యులు చెబితే.. చర్చించి నిర్ణయం తీసుకుంటాం. రైతుబంధులో కోతలు విధిస్తామని మేం చెప్పలేదు. ప్రజలు, సభ్యుల అభిప్రాయం ప్రకారం విధివిధానాలు నిర్ణయిస్తాం' అని తుమ్మల వివరాలు 2లో

## ఇకముందు బెనిఫిట్ షోలు రద్దు

- టిక్కెట్ల పెంపు ప్రతిపాదనలు ఉపసంహరణ
- రేవతి కుటుంబాన్ని ఆదుకోని అల్లు అర్జున్
- ఆ కుటుంబానికి రూ.25 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించిన ప్రభుత్వం


2లో

## కొత్త సంవత్సరం వేళ డ్రగ్స్ కలకలం

- వరుసదాడుల్లో భారీగా మాదకద్రవ్యాల పట్టివేత
- న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల డేగకన్ను




**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్ 21:** మరికొద్దిరోజుల్లో న్యూఇయర్ రాబోతోండగా హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం రేపాయి. ఇటీవలి కాలంలో వరుసగా డ్రగ్స్ పట్టివేతలు కలకలం రేపుతున్నాయి. అయితే న్యూఇయరే టార్గెట్‌గా కొందరు డ్రగ్ ఫెడ్లర్‌లు.. న్యూఇయర్ వేడుకల్లో డ్రగ్స్ వినియోగానికి ప్రయత్నిస్తుంటారు. ఇప్పటికే వివిధ రాష్ట్రాల నుంచి పలు విధాలుగా డ్రగ్స్‌ను నగరానికి వివరాలు 2లో



## అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ షాక్

● కేజ్రీని విచారించేందుకు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అనుమతి

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,డిసెంబర్ 21:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ షాక్ తగిలింది. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కేజ్రీని విచారించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా అనుమతి ఇచ్చినట్లు సమాచారం. ఈ కేసులో డిసెంబర్ 5న మాజీ సీఎంను విచారించేందుకు ఈడీ అనుమతి కోరగా.. అందుకు ఎల్జీ తాజాగా పర్మిషన్ ఇచ్చినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ మేరకు ఎల్జీ కార్యాలయం శనివారం ప్రకటన విడుదల చేసినట్లు సదరు వర్గాలను ఊటంకిస్తూ జాతీయ వివరాలు 2లో

## రైతులకు సంకెళ్లు వేసిన చరిత్ర మీది

కెటిఆర్‌పై మంత్రి సీతక్క విమర్శలు


2లో

## రైతు భరోసాపై తుది నిర్ణయం తీసుకోలేదు

(మొదటి పేజీ తరువాయి)

నాగేశ్వరరావు చెప్పారు. అసెంబ్లీ సమావేశాలు 7వరోజు ప్రారంభమయ్యాయి. ఉదయం శాసనసభ ప్రారంభం కాగా స్పీకర్ అనుమతితో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చను ప్రారంభించారు. రైతు భరోసా ప్రక్రియపై సభ్యులు సలహాలు ఇవ్వాలని మంత్రి తుమ్మల కోరారు. రైతు భరోసాకు సంబంధించిన విధివిధానాలను సంక్రాంతి పండుగ నాటికి ఖరారు చేసి అనంతరం రైతు భరోసా చెల్లింపులు జరుపుతామని మంత్రి ప్రకటించారు. ఈ చర్చలో భాగంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ గత ప్రభుత్వం 2017-18లో రైతుబంధు పథకాన్ని తీసుకొచ్చి సీజన్‌కు ఎకరాకు రూ.4వేలు రైతుల ఖాతాల్లో జమ చేసిందని, 2018-19లో ఈ మొత్తాన్ని రూ.5వేలకు పెంచామన్నారు. ఈ పథకంలో పేర్కొన్నట్లు భూమిని సాగుచేసే రైతులకు మాత్రమే ఇవ్వాలని, అయితే ఈ పథకం అమలులో చాలా తేడా ఉందన్నారు. దీనిని సక్రమంగా అమలు చేసేందుకు వివిధ నిధులను నిర్ణయించేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. పలువురు నిపుణులు, రైతుల సలహాలు, సూచనలు తీసుకుని ఈ కమిటీ విధివిధానాలను సిద్ధం చేస్తుందన్నారు. ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం జనవరిలో అమలు చేయాలని భావించిన ఈ పథకానికి సంబంధించి సభలోని సభ్యుల అభిప్రాయాలను కూడా సేకరించి.. వీటన్నింటిని క్రోడీకరించి తుది విధివిధానాలు ఖరారు చేసి ప్రభుత్వం సిద్ధమైంది. రైతు బీమాను సంక్రాంతి నుంచి అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు.

## ఇకముందు బెనిఫిట్ షోలు రద్దు

- టిక్కెట్ల పెంపు ప్రతిపాదనలు ఉపసంహరణ
- రేవతి కుటుంబాన్ని ఆదుకోని అల్లు అర్జున్
- ఆ కుటుంబానికి రూ.25 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించిన ప్రభుత్వం



**తొలి అక్షరం/హైదరాబాద్, డిసెంబర్ 21:** సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన రేవతి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 25 లక్షలు అందించనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో ఇకపై సినిమా విడుదలకు ముందు రోజు ఎలాంటి బెనిఫిట్ షోలు ఉండవని స్పష్టం చేశారు. అలాంటివాటికి అనుమతులు ఇవ్వబోమని అన్నారు. టికెట్ల రేట్ల పెంపునకూ అనుమతివ్వబోమని పేర్కొన్నారు. తొక్కిసలాట ఘటనలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడి కుటుంబానికి పరిహారం ఇస్తామన్న హామీని అల్లు అర్జున్ నిలబెట్టుకోలేదన్నారు. శ్రీతేజ్ వైద్య చికిత్స కోసం అయ్యే ఖర్చును ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై విపక్ష ఎంఐఎం సభ్యుడు అక్బరుద్దీన్ ప్రస్తావించగా సిఎం రేవంత్ తీవ్రంగా స్పందించారు.

## ప్రభుత్వ కార్యక్రమాలకు ఎమ్మెల్సీలను ఆహ్వానించాల్సిందే : మండల చైర్మన్

**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్ 21:** భూభారతి బిల్లుపై స్వల్పకాలిక చర్చ జరుగుతున్నది.భూభారతి చట్టం అమల్లోకి రాకముందే పేపర్లలో ప్రకటనలు వచ్చాయని విపక్ష సభ్యులు మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి దృష్టి తీసుకొచ్చారు. అదేవిధంగా ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఇలాంటి తప్పులు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి చైర్మన్ సూచించారు. అదేవిధంగా ప్రొటోకాల్ అమలులో అలసత్వం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఎమ్మెల్సీలను ఆహ్వానించాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రొటోకాల్‌పై ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. కాగా, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 2024 బిల్లును, తెలంగాణ పంచాయతీ రాజ్ బిల్లును మండలిలో ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ప్రస్తుతం రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చ కొనసాగుతున్నది.

## అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ షాక్

(మొదటి పేజీ తరువాయి)

మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో మార్చి 21న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆయనను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. లోక్‌సభ ఎన్నికల ప్రచారం కోసం మే 10 నుంచి జూన్ 1 వరకు ఆయనకు తాత్కాలిక బెయిల్ మంజూరైంది. జూన్ 2న ఆయన మళ్లీ జైలులో లొంగిపోగా, జూన్ 20న ట్రయల్ కోర్టులో బెయిల్ దక్కింది. బెయిల్‌ను ఈడీ సవాల్ చేయడంతో జూన్ 25న హైకోర్టు బెయిల్ ఉత్తర్వులపై స్టే ఇచ్చింది. జూన్ 26న ఇదే కేసులో కేజ్రీవాల్‌ను సీబీఐ అరెస్టు చేసింది. జూలై 12న ఈడీ కేసులో సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసినప్పటికీ సీబీఐ అప్పటికే అరెస్టు చేయడం వల్ల ఆయన జైలులోనే ఉండాల్సి వచ్చింది. ఇక సెప్టెంబర్ 13న సీబీఐ కేసులోనూ కేజ్రీకి సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. బెయిల్ దక్కడంతో ఆరునెలల పాటు జైలుజీవితం గడిపిన ఆయన చివరికి సెప్టెంబర్ 14వ తేదీన తీహార్ జైలు నుంచి విడుదలయ్యారు. ఈ కేసులోనే ఈడీ మరోసారి కేజ్రీవాల్‌ను విచారించేందుకు సిద్ధమవుతోంది.

## పుష్పా-2 ఘటన ఎంతో కలిచివేసింది...

(మొదటి పేజీ తరువాయి)

లేకుండా, పోలీసులకు సరైన సమాచారం ఇవ్వకుండా థియేటర్‌కు రావడంతో ఒక మహిళ చనిపోవడంతోపాటు ఆమె కుమారుడు అపస్మార స్థితిలో ఉన్నాడని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరిగినా కనీసం చలనం కూడా లేకుండా అక్కడ ఉండి సినిమా చూస్తా అనడం దేనికి సంకేతమని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఇంకా అక్కడే ఉంటే మరింత ప్రమాదం జరుగుతుందని సినీహీరో అల్లుఅర్జున్‌కు చెప్పిన పోలీసులు ఇప్పటికే ఒకరు చనిపోయారు, ఒకరి పరిస్థితి ప్రమాదకరంగా ఉందని చెప్పినా కూడా వెళ్లకుండా ఉండటంతో మీరు ఇక్కడే ఉంటే అరెస్టు చేయాల్సి వస్తుందని అనడంతో అప్పుడు వెళ్లిపోయారన్నారు. అది కూడా వెళ్లే సమయంలో ఓపెన్‌టాప్ జీపులో చేతులు బయటకు ఊపుతూ కనీసం ఎవరూ చనిపోయారు, ఎవరూ గాయాలు పాలయ్యారు అని చూడకుండా ఉండటం ఎంత వరకు సబబు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఇప్పటికీ ప్రమాదంలో గాయపడిన బాబు పరిస్థితి ఆందోళన కరంగా ఉందని కనీసం సినీ పెద్దలు కానీ, రాజకీయ ప్రముఖులు కానీ వెళ్ల లేదని ఇదా అధ్యక్ష మానవత్వం అంటే అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఒక్కరోజు జైలులో ఉన్నందుకు అల్లుఅర్జున్‌కు పదుల సంఖ్యలో పరామర్శలు, ప్రభుత్వంపైన విమర్శలు చేస్తున్నారని, అల్లుఅర్జున్ ఏమైనా గాయపడ్డారా..? ఏమైనా జరిగిందా..? అని నిలదీశారు. ఒక్క రోజు జైలులో ఉంటేనే మీకు అలా ఉంటే అక్కడ ఒకరి ప్రాణం పోవటంతో, ఏమీన తెలియని చిన్నారి కోమాలోకి వెళ్లిపోతే బాధ కలగదా అని అన్నారు. అల్లుఅర్జున్‌ను కావాలనే ప్రభుత్వం అరెస్టు చేసిందని పదేళ్లు పాలించిన ఒక నాయకుడు ట్విటర్‌లో ఇష్టం వచ్చినట్లు కామెంట్లు పెడుతున్నారని, సమాజం ఎటువైపు పోతుందని ఆయనకు కనీస మానవత్వం కూడా లేదా అని ప్రశ్నించారు. అదే మన ఇంట్లో ఇలాంటి ఘటన జరిగితే మనం ఊరుకుంటామా అని అన్నారు. మరీ అలాంటప్పుడు సినీ హీరోలను అరెస్టు చేయవద్దని ఏమైనా చట్టాలు ఉన్నాయా.. లేకపోతే చేయండి అధ్యక్షా.. అలానే చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఒకింత అసహనానికి లోనయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన చట్టం ప్రకారం పోలీసులు నడుచుకుంటారని వారు రాజకీయ నాయకులా.. సినీ హీరోలా అని చూడరని అన్నారు. నిజంగా హీరోలంటే తెరపైన కాదు.. నిజజీవితంలో ఎలా ఉండాలో చూపిస్తే వారిని ప్రేమిస్తే అభిమానులకు మేలు జరుగుతుందని ఆయన హితవు పలికారు. ఇప్పటికైనా అర్థంపర్థంలేని కామెంట్లు చేయకుండా కనీస మానవత్వాన్ని చాటుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

**ఇలాంటి ఘటనలు ఎవరూ హర్షించరు : అక్బరుద్దీన్ ...** సంధ్య థియేటర్‌లో జరిగిన ఘటనను మానవత్వం ఉన్న ఎవరూ హర్షించరని, దానికి బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ అన్నారు. మనకు పిల్లలు ఉన్నారని, ఇలాంటి ఘటనను తీవ్రంగా వ్యతిరేకించాల్సిందేనని అన్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలుడు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని కోరుకున్నట్లు చెప్పారు. సినీ ప్రముఖులు కూడా ఆ బాలుడిని పరామర్శించకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఇంకా ఘటనకు బాధ్యులైన వారికే సానుభూతి పలకడం ఎంత వరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ఎటువంటి సందేహాలు అవసరం లేదని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## రైతు బంధు ఇస్తే... అసలు చర్చ ఎందుకు..?

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి తుమ్మల చెప్పారని, 2019-20లో సాగు విస్తీర్ణం 141 లక్షల ఎకరాలని మంత్రే చెప్పారని గుర్తు చేశారు. 2020-21లో సాగు విస్తీర్ణం 204 లక్షల ఎకరాలు అని మీరు ఇచ్చిన నివేదికలో ఉందని, రైతుబంధు ఇవ్వడం వల్లే సాగు విస్తీర్ణం 2 కోట్ల ఎకరాలకు పెరిగిందన్నారు.నాలుగున్నర లక్షల గిరిజన బిడ్డలకు పోడు పట్టాలు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దని కేటీఆర్ స్పష్టం చేశారు. ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాల కింద ఉన్న భూముల్లో ఒక పంట మాత్రమే సాగు చేసే అవకాశం ఉంటుందన్నారు. మేజర్ కాల్వలు ఉండకపోవడం వల్ల చాలా కష్టంతో సాగు చేస్తారన్నారు. ఈ గిరిజన బిడ్డలకు రెండో విడత రైతుబంధు ఇస్తారా..? ఇవ్వరా..? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక పత్తి 45 లక్షల ఎకరాల్లో పండుతుందని, ఈ పంట కాలం 8 నెలలు, మరి పత్తి రైతుకు ఒకటే పంటకు ఇస్తారా..? రెండు పంటలకు ఇస్తారా..? అలాగే కంది పంట కాలం కూడా 8 నెలలు.. కాబట్టి కంది పంటకు ఒకటే సారి ఇస్తారా..? రెండు సార్లు ఇస్తారా..? లేదా అనేది చెప్పాలి అని కేటీఆర్ డిమాండ్ చేశారు. రైతుబంధుకు కోతలు పెట్టే ఆలోచన లేకపోతే పీఎం కిసాన్ గురించి మంత్రి తుమ్మల ఎందుకు ప్రస్తావించారని నిలదీశారు. పీఎం కిసాన్ మార్గదర్శకాలు మీకు మార్గదర్శకం అయితే.. 25 శాతం మంది రైతులకు మాత్రమే రైతు భరోసా వర్తిస్తుందన్నారు. పీఎం కిసాన్ మార్గదర్శకాలు పాటించమని మంత్రి తుమ్మల చెబుతున్నారని, మరి ఉన్నది ఉన్నట్టు ఇచ్చేందుకు రైతుబంధుపై చర్చ ఎందుకు..? రైతుబంధుకు కోతలు పెట్టం అనుకుంటే ఎందుకీ చర్చ. కంది, పత్తి 8 నెలల పంట. పామాయిల్ పంటను విపరీతంగా ప్రోత్సహించామన్నారు. పామాయిల్ పంటకు, మామిడి తోటలకు రైతుభరోసా ఇస్తారా..? ఇవ్వరా..? రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో మూడు పంటలు సాగు చేసే వారు ఉన్నారన్నారు. మరి మూడు పంటలకు రైతుభరోసా ఇస్తారా..? ఇదే శాసనసభలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మూడో పంటకు ఎందుకు ఇవ్వరు అని మా ప్రభుత్వాన్ని నిలదీశారు. కాబట్టి మూడో పంటకు రైతుబంధు ఇస్తారా..? ఇవ్వరా..? అనే దానిపై స్పష్టమైన ప్రకటన చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## కొత్త సంవత్సరం వేళ డ్రగ్స్ కలకలం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకువచ్చేందుకు యత్నించారు. అయితే వారి చర్యలను పోలీసులు ఎప్పటికప్పుడు భగ్నం చేస్తూ వచ్చారు. డ్రగ్స్ సరఫరాపై గత కొద్దిరోజులుగా నిఘా పెట్టిన పోలీసులు.. పెద్ద మొత్తంలో డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. డ్రగ్స్‌తో పాటు గంజాయి, హెరాయిన్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఇదిలా ఉండగా.. న్యూఇయర్ వేడుకల్లో డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈ అంశంపై నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సాయి చైతన్య మాట్లాడుతూ.. న్యూ ఇయర్ వేడుకలు సందర్భంగా డ్రగ్స్‌పై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశామన్నారు. కొత్త సంవత్సరాన్ని ఎంతో ఘనంగా ఆహ్వానించేందుకు ఎన్నో ఈవెంట్లు చేస్తుంటారు. న్యూఇయర్ వేడుకలను ఎంతో గ్రాండ్‌గా నిర్వహిస్తుంటారు. పెద్ద పెద్ద ఈవెంట్లను ఏర్పాటు చేస్తుంటారు.లోకల్ పోలీసులతో కోఆర్డినేట్ చేసుకుంటూ ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గత 15 రోజుల్లో నాలుగున్నర కోట్ల డ్రగ్స్‌ను పట్టుకున్నామని.. 266 డాగ్స్‌తో రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు చేశామని చెప్పారు. 100 మీటర్ల దూరంలో ఓ ఇంటిపై పెంచుతున్న గంజాయి మొక్కలను కూడా డాగ్స్ గుర్తించాయన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి డ్రగ్స్‌ను మన రాష్ట్రంలోకి రావడానికి ముందే అడ్డుకోగలుగుతున్నామని తెలిపారు. గత 15 రోజుల కాలంలో 641 కిలోల గంజాయి, 15 కిలోల గంజాయి చా÷-లకెట్లు, 1600 గ్రాముల హాష్ ఆయిల్, 1383 గ్రాముల ఎండిఎంఏ, 1000 గ్రాముల ఓపీఎం చరాస్, 53 గ్రాముల పాపిష్ట ను పట్టుకున్నామని తెలిపారు. 44 గ్రాముల హెరాయిన్‌తో పాటు 148 కేసులను రిజిస్టర్ చేసి 315 మంది నేరస్తులను అరెస్ట్ చేశామని చెప్పారు. అలాగే ఈవెంట్ ఆర్గనైజర్లు డీజే ప్లేయర్ల ట్రాక్ రికార్డు చెక్ చేసుకోవాలన్నారు. ఈవెంట్లలో డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సాయి చైతన్య హెచ్చరించారు. మరోవైపు సంగారెడ్డి జిల్లాలో భారీగా నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. దీనిపై సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ మీడియాతో మాట్లాడుతూ.. టీజీఎన్‌ఏబీ, సంగారెడ్డి పోలీసుల జాయింట్ ఆపరేషన్ నిర్వహించారని.. సుమారు 70 లక్షల విలువచేసే నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్‌ను పట్టుకున్నారని తెలిపారు. మహమ్మద్ సలీం, ముఖేష్ దుబే అనే ఇద్దరు డ్రగ్ ఫెడ్లర్స్‌ను అరెస్ట్ చేశారన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా కస్టమర్లకు డ్రగ్స్ సప్లై చేయడానికి నిందితులు వచ్చారని.. షేక్ అమీర్ అనే వ్యక్తికి 1000 గ్రాముల డ్రగ్స్‌ను అమ్మేందుకు ప్రయత్నం చేశారన్నారు. పక్కా సమాచారంతో ఇస్నాపూర్ వద్ద నిందితులను అరెస్టు చేశామన్నారు. ఢిల్లీలో ఉంటున్న నైజీరియన్‌లు జెమ్మి జెన్నీ అనే వ్యక్తులు వద్ద నుంచి నిందుతులు డ్రగ్స్ కొనుగోలు చేశారన్నారు. ముంబైకి చెందిన మరో వ్యక్తి రైస్ కాన్ అనే వ్యక్తి కూడా డ్రగ్స్‌ను నగరానికి తీసుకొచ్చి అమ్ముతున్నాడని నేరస్తులు తెలిపారన్నారు. నిందితులు వద్ద నుంచి కిలో ఎండిఎంఏ డ్రగ్స్‌తో పాటు నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ ఆక్ట్ కింద కేసు నమోదు చేశామన్నారు. పట్టుబడ్డ నిందితులపై గతంలో డ్రగ్స్ కేసులు ఉన్నాయన్నారు. ప్రజారవాణా మార్గం ద్వారా నిందితులు డ్రగ్స్‌ను హైదరాబాద్‌కు తీసుకువచ్చారని తెలిపారు. ఢిల్లీలో కిలో వెయ్యి రూపాయలకు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో అత్యధిక ధరకు అమ్ముతున్నారన్నారు. వినియోగదారులను గుర్తించి వారిని కూడా అదుపులోకి తీసుకుంటామని సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ స్పష్టంచేశారు.

## రైతులకు సంకెళ్లు వేసిన చరిత్ర మీది

- కెటిఆర్‌పై మంత్రి సీతక్క విమర్శలు

**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్ 21:** రైతులకు సంకెళ్లు వేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మండిపడ్డారు. అసెంబ్లీలో రైతు బంధుపై చర్చ సందర్భంగా కౌలు రైతులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందిస్తూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అ÷-దదె ఇంట్లో ఉంటున్న వ్యక్తి యజమాని అయితే కౌలు రైతులకు రైతుబంధు ఎందుకు ఇవ్వాలి.. కౌలు రైతులకు రైతుబంధు ఇస్తామని నాడు మాట్లాడిన బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు తమ ప్రేమను చాటుకుంటున్నారని ఆమె అన్నారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ రైతు బంధు ఇవ్వలేదని, పట్టా బంధు, పట్టా ఉన్నవారికే రైతుబంధు ఇచ్చారని, కౌలు రైతులకు, చిన్న, సన్నకారు రైతులకు పట్టా అందలేదని ఆమె అన్నారు. రుణమాఫీ గురించి మాట్లాడుతున్నారని, అయితే ఇది రుణమాఫీ కాదని, వడ్డీ మాఫీ మాత్రమేనని ఆమె స్పష్టం చేశారు. రుణమాఫీ పేరుతో ఆ రోజు పెట్టిన నిబంధనల వల్ల నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీలో కొందరికి అర్హత లేదన్న మాట వాస్తవమేనని ఆమె అన్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు అన్నీ చేశామని, ఇంకా రూ.30 వేల కోట్ల రుణమాఫీ ఎందుకు పెండింగ్ లో ఉందో కేటీఆర్ చెప్పాలన్నారు. భూమి లేని పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.కి గ్యాస్ ఇచ్చింది. 500, మరియు రూ. ఇవ్వబోతోంది. భరోసా కింద 12వేలు, బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో భూమిలేని పేదలకు ఏం ఇచ్చారో మంత్రి సీతక్క చెప్పాలని డిమాండ్ చేశారు.



## శాసన సభ పదినిమిషాల ఆలస్యాన్ని తప్పుబట్టిన హరీశ్‌రావు

- గత ప్రభుత్వంలో ఏనాడూ ఇలా జరగలేదు

**తొలి అక్షరం/హైదరాబాద్,డిసెంబర్ 21:** గత ప్రభుత్వం హయాంలో ఏనాడూ శాసన సమావేశాలు ఆలస్యంగా ప్రారంభం కాలేదని, ప్రజాప్రతినిధులే సభా నిబంధనలు పాటించకుంటే ఎలా అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ అనుమతితో మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడారు. సమయం 10:10 కావొచ్చింది. ఈ సెషన్‌లో ఏ ఒక్క రోజు కూడా అసెంబ్లీ పది అంటే పది గంటలకు ప్రారంభం కాలేదు. మీరు లాస్ట్ సెషన్ చూడండి.. పదేండ్లు సభ నడిపితే.. పది అంటే పది గంటలకు కచ్చితంగా ఠంచన్‌గా సభ నడిపాం. సభ సమయ పాలన పాటించడం ముఖ్యం. ప్రతి రోజు ఈ సెషన్‌లో 5, 10, 15 నిమిషాలు ఆలస్యంగా సభ ప్రారంభం కావడం కరెక్ట్ కాదు. సభ అందరికీ ఆదర్శంగా ఉండాలి. మనమే ఇలా ఆలస్యంగా నడపడం కరెక్ట్ కాదని మనవి చేస్తున్నానని హరీశ్‌రావు పేర్కొన్నారు. అనంతరం స్పీకర్ అనుమతితో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు రైతు భరోసాపై స్వల్పకాలిక చర్చ ప్రారంభించారు. రైతు భరోసా విధివిధానాలపై సూచనలు ఇవ్వాలని మంత్రి తుమ్మల సభ్యులను కోరారు. సంక్రాంతి పండుగ నాటికి రైతు భరోసాపై విధివిధానాలను ఖరారు చేసి, ఆ తర్వాత రైతు భరోసా చెల్లింపులు చేస్తామని మంత్రి ప్రకటించారు.



# మనిషి దైనందిన జీవితం గణితంతో ముడిపడి ఉంది

● తొర్రూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రాములు




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) డిసెంబర్ 21:** మనిషి దైనందిన జీవితం గణితంతో ముడిపడి ఉందనితొర్రూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రాములు అన్నారు. తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించారు.గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం తొర్రూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి రాములు మాట్లాడుతూ..గణితంలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులు గణితం పై మక్కువ పెంచుకోవాలన్నారు.నిరంతరం సాధన చేస్తే గణితం సులభతరం అవుతుందన్నారు.లెక్కల్లో రాణిస్తే పోటీ పరీక్షలలో అత్యుత్తమ మార్కులు సాధించవచ్చు అన్నారు.గణితంలో నైపుణ్యం పెంపొందించుకుంటే ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయి అన్నారు.ఆ దిశగా విద్యార్థులు కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ప్రిన్సిపల్ సూచించారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శాంతి కుమార్, వాళ్యనాయక్. అంజుమ్ ఆరా. రజిత, వెంకన్న, విజయ్, శారద,రాధికతో పాటు ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాలకుర్తిలో మినీ క్రిస్మస్ వేడుకలు

● కేక్ కట్ చేసి నియోజకవర్గ ప్రజలకు ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన స్థానిక శాసన సభ్యురాలు యశస్విని ఝాన్సీ రెడ్డి





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) డిసెంబర్ 21:** పాలకుర్తి మండల కేంద్రంలోని శనివారం భాసరత్ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన మినీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేసి నియోజకవర్గ ప్రజలకు ముందస్తుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపిన స్థానిక శాసన సభ్యురాలు యశస్విని ఝాన్సీ రెడ్డిఈ సందర్భంగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ. క్రిస్టియన్ సోదరులు ప్రేమ, శాంతి, సామరస్యానికి ప్రతీకలని, వారి అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తుందని క్రిస్టియన్ సమాజం ఆరోగ్యం, విద్య, మరియు సేవామూల్యాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని. క్రిస్టియన్ సోదరులు సాంఘిక సమతా సిద్ధాంతాలకు ఆచరణ రూపాన్ని అందించారని పేర్కున్నారు.క్రిస్మస్ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని. క్రిస్టియన్ సోదరుల అభ్యున్నతికి ప్రభుత్వం అవసరమైన అర్థిక సహాయ పథకాలు, ఆశ్రమాల అభివృద్ధి, మరియు పుణ్యక్షేత్రాల పునరుద్ధరణ చేపట్టడం జరుగుతుందని తెలిపారు.క్రిస్టియన్ సోదరులకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు ప్రత్యేకంగా స్వయం ఉపాధి పథకాలు ప్రవేశపెట్టినట్లు చెప్పారు. విద్యా రంగంలో అవకాశాలు మరియు స్కాలర్షిప్స్ అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, మరియు మానవత్వంను పురస్కరించుకుంటుందన్నారు. ప్రజల మధ్య సామరస్యాన్ని పెంచే దిశగా ప్రభుత్వం సభ్యసమాజం మద్దతు తీసుకుంటుందని తెలిపారు..ప్రతీ వ్యక్తి సంక్షేమమే మన ప్రభుత్వ లక్ష్యం అని స్పష్టం చేస్తూ, క్రిస్మస్ పండుగ సందేశాన్ని అందరితో పంచుకున్నారు. సమాజం అంతటా స్నేహసౌహార్ధాలు విస్తరించాలని ఆకాంక్షించారు..ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్లు అనుమాండ్ల తిరుపతి రెడ్డి, లావుడ్య మంజుల భాస్కర్, బ్లాక్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, హమ్యా నాయిక్, మండల అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, సంచు సంతోష్, ధారావత్ సురేష్, ఈదులకంటి రవీందర్ రెడ్డి, ముద్దసాని సురేష్, నల్ల శ్రీరామ్, అధికారులు, పాస్టర్స్, క్రిస్టియన్ మత పెద్దలు, నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

# పౌష్టిక ఆహార లోపాల గూర్చి అవగాహన సదస్సు

**తొలి అక్షరం/చెన్నారావుపేట డిసెంబర్ 21:** ప్రాథమిక పాఠశాల ఉప్పరపల్లి ప్రధానోపాధ్యాయులు పరుపాటి సుధాకర్ రెడ్డి అధ్యక్షతన ప్రతినెల మూడవ శనివారం జరిగే ఉపాధ్యాయ తల్లిదండ్రుల సమావేశము జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ సుభాష్ మరియు చెన్నారావుపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి పాపమ్మ హాజరై, తల్లిదండ్రులకు పౌష్టికాహార దినోత్సవం యొక్క ప్రాధాన్యత మరియు విద్యార్థులకు పోషక ఆహార పదార్థాలు అందించినట్లయితే విద్యార్థులు మానసికంగా మరియు శారీరకంగా దృఢంగా ఉంటారు అని తెలియజేశారు. పాఠశాలలో విద్యార్థుల యొక్క ప్రతిభను గుర్తించి అభినందించారు. ఈ సమావేశంలో తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన నాలుగు రూముల భవనం పూర్తి చేయాలని అధికారులను కోరడం జరిగింది. అలాగైతే విద్యార్థుల సంఖ్య కూడా పెరుగుతుంది అని తెలియపరిచారు. గ్రామ కార్యదర్శి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, కలం ఫౌండేషన్ సభ్యులు మరియు మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



# డబ్బాల చిరు వ్యాపారులకు బిజెపి అండగా ఉంటుంది

● బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగ రామ్మోహన్ రెడ్డి



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) డిసెంబర్ 21:** తొర్రూర్ పట్టణంలో స్థానిక మేన్ రోడ్డు లో గత 40 సంవత్సరాల నుండి ప్రధాన రహదారి ప్రక్కన గుమ్చిలు డబ్బాలలో వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారస్తులను ఖాళీ చేయించేందుకు కొంత మంది వ్యక్తులు కుట్రలు పన్నుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని సంబంధిత డబ్బా వ్యాపారాలకు మద్దతుగా బిజెపి ఉంటుందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగ రామ్మోహన్ రెడ్డి అన్నారు. శనివారం రోడ్డు వెడల్పులో సగం పైగా స్థలం కోల్పోయిన డబ్బాల వ్యాపారసముదాయాన్ని బిజెపి నాయకులు పరిశీలించారు. గత నలభై సంవత్సరాల నుండి వ్యాపారం చేసుకుంటున్న చిన్న వ్యాపారస్తులు వీధిన పడే దుస్థితి నెలకొందని అన్నారు. సుమారు 22 డబ్బాలు తొలగించే ప్రయత్నం ఎవరైనా చేస్తే బిజెపి ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.గత నలభై ఏళ్లు గా రెక్కాడితే కానీ డొక్కాడని పేదలు డబ్బాలను నమ్ముకొని తమ జీవనోపాధిని కొనసాగిస్తున్నారు అని,ఈ డబ్బాలను తొలగిస్తే వారు సర్వం కోల్పోయి ఆ కుటుంబాలు రోడ్డన పడి వారి జీవితాలు ఛిద్రం అయ్యే దుస్థితి నెలకొంటుంది అని, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి,స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపాలిటీ అధికారులు మానవతా దృక్పథంతో స్పందించి చిరు వ్యాపారులకు న్యాయం చేసి ఆదుకోవాలని లేని యెడల బీజేపీ నేతృత్వంలో ఉద్యమానికి స్వీకారం చుట్టి వారికి మద్దతుగా పోరాడుతామని, చిరు వ్యాపారులను బెదిరింపు లకు గురిచేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, తొర్రూర్ శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి కాగు నవీన్, అర్బన్ మండల ప్రధాన కార్యదర్శి పైండ్ల రాజేష్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు మంగళపల్లి యాకయ్య, బూత్ కమిటీ అధ్యక్షులు నడిగడ్డ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాదుల భూ నిర్వాసితులకు ప్యాకేజ్ 6 ద్వారా నిధుల మంజూరి

● పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పంపిణి చేసిన శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి



**తొలి అక్షరం/పెద్దవంగర డిసెంబర్ 21:** పాలకుర్తి నియోజకవర్గం లోని పెద్దవంగర మండలం లోని పోచంపెల్లి గ్రామానికి 250 మంది దేవాదుల భూ నిర్వాసితులకు నష్టపరిహారంగా మంజూరైన 11 కోట్ల 40 లక్షల రూ న్యాయపరంగా పంపిణీ చేసినారు ఈ ప్యాకేజ్ ద్వారా భూ నిర్వాసితులకు ఆర్థిక సహాయం అందించడం మాత్రమే కాకుండా, వారి జీవనోన్నతికి అవసరమైన అన్ని విధాల సహకారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్టు వంటి అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రానికి ప్రగతి దిశగా ముందడుగు వేయిస్తాయి. అయితే, ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రభావితమైన ప్రజల హక్కులు, జీవితోపాధి నష్టపోకుండా చూసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తుచేశారు. భూమి కోల్పోయిన వారికి ఆర్థిక సహాయం అందించటం ద్వారా కొత్త జీవనశైలిని ఏర్పరచుకునే అవకాశం కల్పించడం. అవకాశాలు, సమగ్ర పునరావాస పథకాలు అందించడం జరుగుతుంది అని అన్నారు.ఈ ప్యాకేజ్ 6 ద్వారా పారదర్శక విధానం ద్వారా నిధుల పంపిణీ జరుగుతుందని, ప్రతి నాయమైన వ్యక్తికి ఇది ఉపయోగకరమవుతుందని చెప్పారు. భూ నిర్వాసితుల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన ఈ కీలక కార్యక్రమం న్యాయబద్ధతతో కూడిన అభివృద్ధి పునాది వేస్తుందని వారు స్పష్టం చేశారు.. భూ నిర్వాసితుల కష్టాలను పరిష్కరించడంలో కీలక భూమిక పోషిస్తుందని, నిధుల పంపిణీ సమయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు స్ఫూర్తి కలిగించే కార్యక్రమమని అభివర్ణించారు.ఈ పథకం విజయవంతం కావడంలో ప్రతి ఒక్కరి సహకారం ముఖ్యమని, ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహాయపడతామని హామీ ఇచ్చారు. భూ నిర్వాసితుల అభ్యున్నతే ప్రభుత్వ అసలు లక్ష్యం అని వారు పేర్కొన్నారు.ఏఎంసీ మార్కెట్ చైర్మన్ అనుమాండ్ల తిరుపతి రెడ్డి, తొర్రూరు ఆర్ డి ఓ , ఇరిగేషన్ ఈ ఈ , ఎ ఈ లు, ఎంపీడీఓ, బ్లాక్ అధ్యక్షులు హమ్యా నాయక్, మండల అధ్యక్షులు ముద్దసాని సురేష్, ధరావత్ సురేష్ నాయిక్, సంచు సంతోష్, సీనియర్ నాయకులు గంజి విజయపాల్ రెడ్డి, నరేందర్ రెడ్డి, రంగు మురళి, డైరెక్టర్లు మన్మోహన్ రెడ్డి, పూర్ణ చందర్, గోపాల్, గ్రామ పార్టీ అధ్యక్షులు రాసాల ప్రభాకర్, వేణు, రాజు, సోము నాయక్, సమయ్య, యువజన నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.



## అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలి



**తొలి అక్షరం/చెన్నారావుపేట డిసెంబర్ 21:** భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ పై పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తక్షణమే క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండల యూత్ నాయకులు మంద నరేష్ డిమాండ్ చేశారు.ఎన్నికల ముందు రాజకీయ పబ్బం కోసం అంబేద్కర్ జపంచేసి అధికారంలోకి వచ్చాక అంబేద్కర్ పేరు ఎత్తకూడదు అని చెప్పడం సిగ్గుసేటనీ ,అంబేద్కర్ పై దాడి అంటే రాజ్యాంగం పై దాడిగానే దేశంలోని ప్రతి పౌరుడు భావించాలని అన్నారు . అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలను అమిత్షా వెనక్కి తీసుకొని దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఏడుపాయల హుండీ ఆదాయం 41 లక్షల96 వేలు



**తొలి అక్షరం/పాపన్నపేట డిసెంబర్.21:** ఏడుపాయల వన దుర్గ భవాని దేవి ఆలయ 59 రోజుల హుండీ ఆదాయం 41లక్షల 96 వేల ఆరువందల పన్నెండు రూపాయల ఆదాయం దేవాదాయ ధర్మాదాయ శాఖ కు వచ్చినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి,ఇఓ చంద్రశేఖర్లు వెల్లడించారు. శనివారం హుండీ లెక్కింపు కార్యక్రమం రాజరాజేశ్వరి సేవా సమితి అధ్వర్యంలో గోకుల్ షేడ్ లో నిర్వహించగా దేవాదాయ ధర్మాదాయ శాఖ, అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి పర్యవేక్షణలో లెక్కింపు ప్రక్రియ చేపట్టగా బంగారు, వెండి వస్తువుల మినహా నగదు రూపంలో41 లక్షల 96 వెల ఆరు వందల పన్నెండు రూపాయల ఆదాయం ఏడుపాయల దేవాదాయ ధర్మాదాయ శాఖ కు ఆదాయం సమకురినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంల ఆలయ సిబ్బంది సూర్యశ్రీనివాస్,లక్ష్మీనారాయణ, మధుసూధన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్ శర్మ, యాదగిరి, తోపాటు రాజరాజేశ్వరి సేవా సమితి సభ్యులు పాల్గొనగా పాపన్న పేట పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

## నెక్కొండలో సెమీ క్రిస్మస్ వేడుకలు




**తొలిఅక్షరం/నెక్కొండ, డిసెంబర్ 21:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని సిబిసి చర్చిలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ రాజ్ కుమార్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్ పాల్గొని, కేక్ కట్ చేసి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని అన్నారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ ఆశీర్వాదం పట్టణ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్, ఈదునూరి సాయికృష్ణ కుసుమ చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

## బర్త్డే వేడుకల్లో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్

**తొలిఅక్షరం/నెక్కొండ, డిసెంబర్ 21:**వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణానికి చెందిన భాష బోయిన మహేష్ కుమారుడు మొదటి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసిన నెక్కొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్. నెక్కొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, నెక్కొండ మాజీ ఉప సర్పంచ్ కుసుమ చెన్నకేశవులు, మండల కాంగ్రెస్ నాయకులు ఈదునూరి సాయి కృష్ణ, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్ రెడ్డి,రామారపు రాము,శ్రీకాంత్,తదితరులు పాల్గొన్నారు.



# స్కూల్ విద్యార్థులకు 8000 వేల రూపాయలు విరాళం

● అందజేసిన గుండెపుడి మాజీ సర్పంచ్ నూకల కిషన్ రెడ్డి ● గతంలోనూ గ్రామానికి పలుమార్లు సొంతంగా ఆర్థిక సాయం చేసిన విషయం తెలిసిందే



**తొలి అక్షరం/మరిపెడ, డిసెంబర్ 21:** మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం గుండెపుడి గ్రామంలో ఉన్న జడ్పిహెచ్ఎస్ పాఠశాల లో ఎస్ఎస్సి విద్యార్థులకు గుండెపుడి మాజీ సర్పంచ్ శ్రీ నూకల కిషన్ రెడ్డి తమ గ్రామంలో 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంచి ఉత్తీర్ణత సాధించాలనే ఉద్దేశ్యంతో 8000 /- రూపాయలు విలువ కలిగిన ఆల్ ఇన్ వన్ పుస్తకాలు అందించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మండలంలోనే ఉన్నత స్థాయిలో ఉండాలని అలాగే 10/10 GPA సాధించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ మురళీకృష్ణ గారు మాట్లాడుతూ రాబోయే ఎస్ఎస్సి ఫలితాలలో మా విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించేలా మా ఉపాధ్యాయ బృందం పనిచేస్తుందని అలాగే వంద శాతం రిజల్ట్ సాధించి మండలంలోనే మొదటి స్థానంలో ఉండేలా కృషి చేస్తామని చెప్పారు. ఆలాగే పాఠశాలలో గణితదినోత్సవం నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు కూడ మాజీ సర్పంచ్ కిషన్ రెడ్డిని అభినందించారు గతంలోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలు ఊర్లో ఎన్నో రకాలుగా చేపట్టిన విషయం గ్రామస్తుల అందరికీ తెలిసిందే అన్నారు ఈ కార్యక్రమం లో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ బింగి సుజాత,మరియు పాఠశాల ఉపాద్యాయ బృందం సరోజ, కల్పన, దత్త ప్రసాద్,రాజు,కృష్ణారెడ్డి, లింగ్య నాయక్, ఉషా వాణి, మమత తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవ వేడుకలు






**తొలి అక్షరం/షాద్ నగర్, డిసెంబర్21:** రంగారెడ్డి జిల్లా,షాద్ నగర్ పట్టణంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాల భాగ్యనగర్ కాలనీలో శనివారం నా శ్రీనివాస రామానుజన్ జయంతి , జాతీయ గణిత దినోత్సవ సందర్భంగా పాఠశాల ఆవరణలో గణితదినోత్సవ వేడుకలను నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని గణితానికి సంబంధించిన నమూనాలు ప్రదర్శించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రఫత్ సుల్తానా మాట్లాడుతూ గణితం యొక్క ప్రాముఖ్యత వివరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గణితం ఒక లైఫ్ స్కిల్.గణితం అనేది తర్కాన్ని వర్తింపజేయడం ద్వారా వివిధ సమస్యలను పరిష్కరించడం.విద్యార్థిగా, ఇది మీ తార్కిక తార్కిక నైపుణ్యాలను మెరుగుపరచడం ద్వారా విభిన్న సమస్యలను అర్థం చేసుకోవడంలో మరియు పరిష్కరించడంలో మీకు సహాయపడుతుంది. గణిత సమస్యలను పరిష్కరించడం అనేది మీ దినచర్యలో మీరు చేయగలిగే అత్యుత్తమ మెదడు వ్యాయామాలలో ఒకటి. అని తెలియ పరచారు.ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల గణిత ఉపాధ్యాయులను సన్మానించారు.

# అప్పలరావుపేటలో ఘనంగా ముందస్తు గణిత దినోత్సవ వేడుకలు



**తొలిఅక్షరం/నెక్కొండ, డిసెంబర్ 21:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అప్పలరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం గణిత దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈనెల 22న ప్రముఖ భారతీయ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని, ముందుగా పాఠశాలలో గణిత దినోత్సవం జరిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే, రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యజీవితంలో గణిత ఆవశ్యకతను వివరించారు. గణితం లేని రోజు,గణిత అనువర్తనాలు లేని ప్రపంచం మనం ఊహించలేమన్నారు. కొన్ని సందర్భాలలో విఫలమైనప్పటికి పట్టుదలతో ముందుకు సాగితే అనూహ్య విజయాలను సొంతం చేసుకోవచ్చని రామానుజన్ జీవితం మనకు చూపుతోందన్నారు,గణిత శాస్త్ర ఉపాధ్యాయులు రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులు పలు ఎగ్జిబిట్లను రూపొందించి ప్రదర్శించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శ్రవణ్ కుమార్, గీత ,దయాకర్ పాల్గొన్నారు.

# శాసనమండలిలో ఎన్నో సమస్యలు వినిపిస్తున్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

● హెూంగార్డులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వానికి సూచన

● హెూంగార్డులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి

● హెూంగార్డులకు జీతాలు పెంచిన ఘనత బీఆర్ఎస్‌దే

● పదివేల మంది ఉద్యోగులకు పాత పెన్షన్ పద్ధతే వర్తింపచేయాలి




**తొలి అక్షరం/షాద్ నగర్, డిసెంబర్21:** అహర్నిశలు పనిచేస్తున్న హెూంగార్డులకు తప్పనిసరిగా హెల్త్ కార్డులు ఇవ్వాలంటూ, అలాగే హెూంగార్డులను పర్మినెంట్ చేయాలని, గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో హెూంగార్డ్ ల నెల జీతం చాలా పెంచారంటూ, రిటైర్మెంట్ తర్వాత హెూంగార్డులకు ఎలాంటి బెనిఫిట్స్ ఉండవు కనుక ప్రస్తుత ప్రభుత్వం హెూంగార్డులను దృష్టిలో పెట్టుకొని వారిని పర్మినెంట్ చేయాలని, అలాగే వారికి జీతాలు కూడా పెంచాలని, ఒకవేళ ఒకటి రెండు రోజులు వారు ఉద్యోగానికి రాకుంటే వారి జీతం కట్ చేయకుండా ఉండాలని, హెూంగార్డులను ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా చూసే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని శాసనమండలిలో ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి ప్రభుత్వానికి విన్నవించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ ఒకటో నెల 2024 నుండి నూతన ప్రభుత్వ పెన్షన్ స్కీమ్ అమల్లోకి వచ్చిందంటూ, అంతకు ముందే రెండు మూడు 2023 లో నోటిఫికేషన్ వచ్చి, ఫలితాలు కూడా వచ్చి, కొన్ని అనివార్య కారణాలు కారణాల వలన ప్రభుత్వం వారికి ఉద్యోగాలు ఇవ్వలేకపోయిందని, కానీ కేంద్ర ప్రభుత్వం 2023 లోని చట్టం తెచ్చిందని ఉద్యోగాలు రాలేకపోయిన వారిని కూడా అదే స్కీమ్ లోకి తీసుకోవాలని, ఈ చట్టాన్ని అనేక రాష్ట్రాలు అమలు చేస్తున్నాయని, 6500 మంది టీచర్లు, 2200 మంది పోలీస్ డిపార్ట్మెంట్ వాళ్లు దాదాపుగా 10000 మంది ఉన్నారంటూ వారందరికీ పాత పెన్షన్ పద్ధతిలోనే తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించారు.

# వీళ్ళకా మనం ఓట్లు వేసి గెలిపించింది

● అసెంబ్లీలో పేద ప్రజలపై చర్చనే లేదు ● మెజారిటీ ప్రజల బాగుకై ఆలోచనే లేదు ● మనం ఎందుకొచ్చాము ఏం జేస్తున్నాం అన్న ఆలోచనే లేదు ● ఇప్పటికైనా మిమ్మల్ని గెలిపించి అసెంబ్లీకి పంపించిన ప్రజలను దృష్టిలో పెట్టుకొని ముందుకు వెళ్ళండి ● రానున్న లోకల్ బాడీ ఎలక్షన్‌లో మీ జాతకాలు తారు మారు కాకుండా చూసుకోండి

● పసుపుల ప్రశాంత్ ముదిరాజ్ బీసీ సేన రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు



**తొలి అక్షరం/షాద్ నగర్, డిసెంబర్21:** అసెంబ్లీ అంటే ఈ రాష్ట్రంలో ఉన్న నాలుగు కోట్ల జనాభా తలరాతలను మార్చే దేవాలయంలా భావిస్తాం కానీ అసలు అక్కడ ఏం జరుగుతుంది టీవీ ల ముందు కూర్చుని చూస్తుంటే వీళ్లనా మనం నమ్మి మనకేదో చేస్తారని ఓట్లు వేసి గెలిపించి అసెంబ్లీ పంపింది అని ప్రజలు సిగ్గుపడుతున్నారు.ఈ రాష్ట్రంలో ఉన్న పేద ప్రజల బాగోకులు ఎలా మార్చాలి మెజారిటీ ప్రజల జీవితాలు ఏమైతున్నాయి అని అంతఃకరణ శుద్ధితో ఆలోచించే ఎమ్మెల్యే లు కరువై పోయారు మల్లారెడ్డి రియల్ ఎస్టేట్ పడిపోయింది అంటాడు ఆయనైతే అసెంబ్లీ ని జబర్దస్త్ స్టేజి లెక్క మార్చే ప్రయత్నం చేస్తుంటాడు. అసెంబ్లీ లో ఆయన ఎప్పుడు మాట్లాడిన సొంత బిజినెస్ బాగోగుల పై మాట్లాడినట్టే ఉంటది తప్ప ఏ రోజు నియోజక వర్గ ప్రజల తరుపున మాట్లాడినట్టు అస్సలు ఉండదు. ఇంకో ఆయన 4 కోట్ల జనాభా ని పక్కన పెట్టి రాష్ట్రం లో అసలేం సమస్యలే లేనట్టు అల్లు అర్జున్ టాపిక్ మాట్లాడుతాడు ఇంకో ఆయన భూతులు మాట్లాడుతాడు ఇలా చెప్పుకుంటే పోతే కుప్పలు కుప్పలు ఉన్నాయి ఇందులో ఒకటన్న పేద ప్రజల తలరాతలు మార్చే దారి కనిపిస్తుందా ఇవి వినటానికా మనం వీళ్లని గెలిపించి అసెంబ్లీ కి పంపించింది సమయమంతా కొట్లాటలకు ఒకరిని ఒకరు తిట్టుకోవటానికే సరిపోతుంది వీధి రౌడీల్లా ప్రవర్తిస్తూ స్పీకర్ మీదకి దూసుకు పోతున్నారు అసెంబ్లీ లో అసలు ఏం జరుగుతుంది సిగ్గు పడుతున్నారు ప్రజలు మిమ్మల్ని చూస్తు కాస్త ఆలోచించండి మనం ఎందుకొచ్చాము ఏం చేస్తున్నాం ఇక్కడని కోట్లాది జనం మీ మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నారు పూర్తిగా వాళ్ళ ఆశలను వొమ్ము చెయ్యకండి. ప్రజలు ఆర్థిక సంక్షోభం వొచ్చి కొట్టు మిట్టాడు తిన్నారు ఇప్పటికైనా మారి కాస్త మిమ్మల్ని అసెంబ్లీ కి పంపిన ప్రజల గురించి ఆలోచించండి లేదంటే లోకల్ బాడీ ఎలక్షన్ పక్కా ప్రజలు మీకు బుద్ధి చెప్తారు జాగ్రత్త%.

# పుట్టినరోజు వేడుకలలో పాల్గొన్న తొలి అక్షరం రిపోర్టర్



**తొలిఅక్షరం/నెక్కొండ, డిసెంబర్ 21:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల పరిధిలోని చిన్న కొర్పుల్ కరోబార్ పిట్టల స్రవంతి-రాజ్ కుమార్ కుమారుడైన పిట్టల రుద్రాన్ష్ పుట్టినరోజు వేడుకల్లో నెక్కొండ మండలం తొలి అక్షరం రిపోర్టర్ కొయ్యడ సుధాకర్ పాల్గొని పిల్లలందరి మధ్యలో కేక్ కట్ చేసి ఆనందంతో శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. పిట్టల రుద్రాన్ష్‌కు దీవెనలను అందించడం జరిగింది. అన్నబోయిన మల్లమ్మ- అశోక్ కుమార్, కోయిల సూర్యం, పిట్టల అక్షర, చిరబోయిన నాగార్జున్, అరవింద్,దియా, రియాన్సీ, నూతన గంటి లోకేష్, పిట్టల ప్రణయ,తొగరు జయకృష్ణ,యశ్వంత్, మాదాటి దీక్షిత,సాత్విక్, కొయ్యడ వర్షిత్, కొయ్యడ రుద్రాన్ష్, కొయ్యడ శాన్విత,అరవింద్ ,చిరబోయిన ఐశ్వర్య, ముత్తు నూరి ఎల్లయ్య చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# మెతుకుసీమ గిరిజన బిడ్డలకు దక్కిన అపూర్వ గౌరవం

● నేషనల్ బాల రంగ్ ఫెస్టివల్‌కు తెలంగాణ రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం చేసిన పాపన్నపేట విద్యార్థులు







**తొలి అక్షరం/పాపన్నపేట డిసెంబర్21:** వివిధ రాష్ట్రాల సంస్కృతి సంప్రదాయాలు విలువలు అందరికీ విస్తరించాలన్న ఉద్దేశంతో కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మధ్య ప్రదేశ్ లోని భోపాల్ లో నేషనల్ బాల రంగ్ ఫెస్టివల్ ను డిసెంబర్ 21 ,22 తేదీలలో నిర్వహించడం జరిగింది. ఈ సాంస్కృతిక వేడుకకు తెలంగాణ రాష్ట్రం నుండి మెదక్ జిల్లా పాపన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థులు గిరిజన సంప్రదాయాన్ని నృత్య రూపంలో ప్రదర్శించారు .చక్కని వేషధారణతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఎలాంటి రికార్డింగ్ ను వాడకుండా విద్యార్థులే వాయిద్యాలను వాయిస్తూ, సేవాలాల్ పాట పాడుతూ తీజ్ పండుగ ప్రాశస్త్యాన్ని ప్రదర్శించారు. వారి వెంట రాష్ట్ర కల్చరర్ కో ఆర్డినేటర్ గిరి ,ఈ నృత్యానికి కొరియోగ్రఫీ చేసిన తెలుగు ఉపాధ్యాయులు అంజాగౌడ్ , ఉపాధ్యాయులు కృష్ణ కాంత్ , ఇందిర ఉన్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి లో నృత్య ప్రదర్శన చేసే అవకాశం రావడం పాఠశాలకు దక్కిన అపూర్వమైన గౌరవమని అన్నారు. .జాతీయ స్థాయిలో నృత్య ప్రదర్శన చేసిన విద్యార్థులను జిల్లా విద్యాశాఖాధికారి రాదాకిషన్ ,ఏఎంవో సుదర్శన మూర్తి ,మండల విద్యాధికారి ప్రతాప్ రెడ్డి ,మండల విద్యాభిమానులు అభినందించారు.

# 26న జరుగు స్వర్ణోత్సవాల జెండా ఆవిష్కరణను విజయవంతం చేయండి..

● సిపిఐ మండల కార్యదర్శి బైస స్వామి పిలుపు..

**తొలి అక్షరం/నెల్లికుదురు,డిసెంబర్ 21:** భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించిన తరుణంలో స్వర్ణోత్సవాల జండా ఆవిష్కరణ విజయవంతం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి బైస స్వామి పిలుపునిచ్చారు. శనివారం సిపిఐ మండల కార్యవర్గ సమావేశం అల్వాల యాకయ్య అధ్యక్షతన నిర్వహించగా సిపిఐ మండల కార్యదర్శి బైస స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 1925లో ఆవిర్భవించిందని 99 సంవత్సరాలు పూర్తి చేసుకుని 100 సంవత్సరాల్లో అడుగుపెట్టబోతుందని, ఈ సందర్భంగా ఈ నెల 26 న మండల కేంద్రంలో జెండా ఆవిష్కరణ చేయాలని నిరహించడం జరిగిందన్నారు.ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాగా నల్లగొండలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆవిర్భావ దినోత్సవంను నల్లగొండ జిల్లా లో ఈనెల 30 న జరుగు భారీ ఆవిర్భావ బహిరంగ సభ కు అధిక సంఖ్యలో కాపాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ సీనియర్ నాయకుడు మండల సహాయ కార్యదర్శులుల తూటి వెంకటరెడ్డి, చిర్ర సత్య నారాయణ, కొట్టే లక్ష్మి, తోట ఉప్పలమ్మ, చిర్ర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# యూసుఫ్ పేట ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవం



**తొలి అక్షరం/పాపన్నపేట డిసెంబర్21:** డిసెంబర్ 22 వ తేదీన శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా యూసుఫ్ పేట ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన గణిత నమూనాలను ప్రదర్శించి,విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి,గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ మాలతిదేవి మాట్లాడుతూ గణితం పట్ల భయాన్ని వీడి,విజయాన్ని పొందాలని విద్యార్థులకు సూచించారు. ఈకార్యక్రమంలో గణిత ఉపాద్యా యులు హీరాలాల్,పవన్ కుమార్,ఉపాద్యాయులు పద్మ,శ్రీనివాస్,రఫీక్, శ్రవణ్ కుమార్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

# వండర్ ఫుల్ సార్..!!

**● పాఠశాల రూపురేఖలు మార్చిన హెచ్ఎం సాయిలు అభినందనీయుడు ఉపాధ్యాయులను ప్రశంసించిన శ్రీరామగిరి గ్రామస్తులు..**







**తొలి అక్షరం/ నెల్లికుదురు,డిసెంబర్ 21:** ఒకానొకప్పుడు పాఠశాలకు తమ పిల్లలను బడికి పంపించాలంటే భయపడిన రోజులు, కానీ ఆ భయాన్ని పోగొట్టి, పాఠశాలకు పిల్లలను పంపించాలనే తల్లిదండ్రుల కు నమ్మకం ఉత్సాహం నింపిన ఆపాఠశాల హెచ్ఎం సాయిలు అభినందనీయులు,ఆపాఠశాల హెచ్ ఎంతో పాటు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఆపాఠశాల పై చూపుతున్న శ్రద్ధ అంత ఇంతకాదు, గ్రామస్తులు వారిని ప్రశంసిస్తున్నారు. వివరాల్లోనికి వెళ్తే నెల్లికుదురు మండలం శ్రీరామగిరి ప్రాథమికోన్నత పాఠశాలలో పాఠశాల ఆవరణలో పెద్ద పెద్ద రాళ్లతో నిండి పాఠశాల వచ్చే విద్యార్థులకు ఇబ్బందికరంగా మారి పాఠశాలకు రావాలంటేనే విద్యార్థిని విద్యార్థులు అన్నాసక్తి చూపేవారు.ఇలాంటి తరుణంలో ఇటీవల బదిలి పై వచ్చిన హెచ్ ఎం బొమ్మరతి సాయిలు ప్రత్యేక చొరవ తీసుకుని తుఫాన్ వరద తాకిడికి పాఠశాల గ్రౌండ్ లేవాలు కొట్టుకు పోయి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో గ్రామస్తులను సంఘటితం చేసి స్వచ్ఛంద సంస్థల సహకారం పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రత్యేక శ్రద్ధ చూపి ట్రాక్టర్లతో మొరం పోయించి గ్రౌండ్ నుచదును చేయించారు.పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులచే పాఠశాల తరగతి గదులకు విద్యుత్ సౌకర్యం తో పాటు లైటింగ్,ఫ్యాన్స్ సమకూర్చారు.పాఠశాల విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ, క్రీడ వ్యాయామం నిర్వహిస్తున్నారు.పాఠశాల విద్యార్థులకు స్వయ ంగా హెచ్ ఎం సాయిలు యోగ శిక్ష నిర్వహించడం గమనార్హం, ఏదిఏమైనా హెచ్ ఎం సాయిలు, ఉపాధ్యాయుల చొరవ పాఠశాల విద్యాభివృద్ధికి బాటలు వేస్తుందనడం లో సందేహం లేదు.ఈ విషయంలో విద్యార్థిని విద్యార్థుల తల్లి దండ్రులు,గ్రామస్తులు పాఠశాల ఉపాధ్యాయులను అభినందిస్తున్నారు.

# విద్యార్థులలో సృజనాత్మకత వెలికి తీయడానికే సైన్స్ ఫెయిర్: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ






**తొలి అక్షరం/గణపురం:** విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికి తీయడానికి సైన్స్ ఫెయిర్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శనివారం మండలంలోని చెల్పూర్ కేటిపిపి లోని డి.ఏ.వి పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రారం భించారు.అనంతరం విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూవిద్యార్థుల్లో సృజనా త్మకత పెంపొందించడానికి సైన్స్ ఫెయిర్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవడం ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడతారని తెలిపారు. ఇలాంటి సైన్స్ ఫెయిర్‌లు శాస్త్రజ్ఞానాన్ని ప్రజలకు చేరవేసే ఒక గొప్ప వేదికగా నిలుస్తాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలలో సైతం ప్రతిభ కనబరచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం ఆటలలో గెలుపొందిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. కేటిపిపి సి.ఈ శ్రీప్రకాశ్, పాఠశాల ప్రిన్సిపల్ శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

**● కాకతీయ హై స్కూల్ అన్వల్ డే ప్రోగ్రాంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్**



**తొలి అక్షరం/షాద్ నగర్, డిసెంబర్21:** షాద్ నగర్ భాగ్యనగర్ కాలనీ కాకతీయ హై స్కూల్ టౌన్ గ్రీన్ పార్క్ గార్డెన్ లో కాకతీయ హై స్కూల్ అన్యువల్ డే సెలబ్రేషన్ ప్రోగ్రాంలో పాల్గొన్న షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్. విద్యార్థులు చదువును బలవంతంగా భావించకుండా ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. విద్యార్థులు విద్యార్థి దశనుండే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికలు రచించుకొని ముందుకు సాగాలని గమ్యం చేరే సమయంలో కాంపిటేటివ్ పరీక్షల్లో ఒడిదొడుకులు సహజమని ఒత్తిళ్లకు లోనవ్వకుండా ఒడిదదుకులు తట్టుకొని ముందుకు సాగాలన్నారు. సమాజంలో తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మంచి పేరు తీసుకురావాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని లక్ష్యసాధనకు శ్రమించాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ లక్ష్యసాధన దిశగా ముందుకు వెళితే అనుకున్నది సాధించ వచ్చు నన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా బాగా చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వాతి ఉన్నత చదువులు చదివి గవర్నమెంట్ జాబ్ ఎంపిక అయ్యి ఉండి కూడా విద్యార్థులకు విద్యాబోధన చేయాలనే ఆకాంక్షతో బాలబాలికలకు మంచి విద్యను అందించి గొప్ప వాళ్ళను చేయాలనే సంకల్పంతో కాకతీయ స్కూల్ పెట్టి చిన్నారులకు విద్యాభ్యాసం చేస్తునందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వాతికి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చిన్నారులు ఆర్మీ జవాన్ ల వేశాధారణలో చేసిన నృత్యం అందరినీ కంట తడి పెట్టించింది. ఇటీవలే మృతి చెందిన ఆర్మీ జవాన్ చంద్రశేఖర్ ముదిరాజ్ సతీమణి ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, కార్యక్రమంలో టీవీ రంగయ్య , కౌన్సిలర్ ప్రేమలత యుగంధర్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయల భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించుకుందాం

**● పార్టీ కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు**





**తొలి అక్షరం/పాపన్నపేట, డిసెంబర్ 21:** భక్తులకు శాశ్వత సౌకర్యాల కల్పన దిశగా అడుగులు వేసి ఏడుపాయల అభివృద్ధి చేసుకుందామని మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. శనివారం ప్రసిద్ధ పుణ్య క్షేత్ర మైన ఏడుపాయల వన దుర్గ భవాని మాత ను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం ఈ నెల 25న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏడుపాయల వన దుర్గ భవాని మాతను దర్శించుకోవడంతోపాటు మెదక్ చర్చి నీ సదర్శిస్తున్న సందర్భంగా ఆయన ఏడుపాయల లో పార్కింగ్, హెలిప్యాడ్ స్థలాల పరిశీలన చేశారు. అనంతరం స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో మొట్టమొదటి సారి గా ఏడుపాయల వన దుర్గ భవాని మాత సన్నిధికి ముఖ్యమంత్రి రావడం మన జిల్లా అదృష్టమన్నారు. కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి కార్యక్రమం దిగ్విజయం చేయాలని పిలుపు ఇచ్చారు. ముఖ్యమంత్రి రాక తో ప్రాంత అభివృద్ధి తోపాటు ఆలయ అభివృద్ధి చెందుతుందని. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు సంఖ్య పెరుగుతుందన్నారు. ఏడుపాయల కమాన్ నుండి ఆలయం వరకు వచ్చే ప్రధాన రహదారి నీ రెండువరుసల రహదారిగా మార్చడమే కాకుండా బటర్ ప్లై విద్యుత్ దీపాలు, డివైడర్ ల తో రోడ్డు నిర్మాణం కోసం నిధులు కేటాయింపు చేయాలని ముఖ్యమంత్రిని కోరడంతో ఆయన స్పందించి వెంటనే 35కోట్ల నిధులు మంజూరుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు.మెదక్,దుబ్బాక, సిద్దిపేట పార్టీ ఇంచార్జిలు ఆంజనేయులు, చెరుకు శ్రీనివాస్ రెడ్డి, హరికృష్ణ, మెదక్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, శ్రీకాంత అప్పు, మండల పార్టీ అధ్యక్షుడు గోవింద్ నాయక్, సీనియర్ నాయకుడు ప్రశాంత్ రెడ్డి, వెంకట్ రమణ, మాజీ ఏడుపాయల చైర్మన్లు నర్సింలు గౌడ్, పర్శ నర్సింలు, వేంకటేశ్వర రెడ్డి, నరేందర్ గౌడ్, కిష్టయ్య, తోపాటు వివిధ గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విట్యాల ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్


**● పిల్లలు ఎల్లప్పుడూ పౌష్టికాహారం తీసుకోవాలి**

**● జంక్ ఫుడ్‌లకు చిప్స్ వంటి వాటికి పిల్లలను దూరంగా ఉంచండి**

**● పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆవుల రవి**



**తొలి అక్షరం/షాద్ నగర్ రూరల్, డిసెంబర్21:** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విట్యాలలో ఘనంగా తల్లిదండ్రుల ఉపాధ్యాయ సమావేశం జరిగింది ఈ సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆవుల రవి ఉపాధ్యాయులు ఎం కల్పన ఎస్ మల్లికార్జున శర్మ వెంకటరమణ మల్లేష్ ఏ శేఖర్ విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు. తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశంలో ప్రధానమైన అంశంగా పౌష్టికాహారం సర్వపిండి సకినాలు పట్టీలు మొలకెత్తిన గింజలు విద్యార్థుల తల్లిదండ్రులు ఇంటిదగ్గర చేసుకొచ్చిన పౌష్టికాహారాలతో గింజలతో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించడం జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ నాణ్యమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి నాణ్యతలేని చిప్స్ జంక్ ఫుడ్ విద్యార్థులు తీసుకోవద్దని ప్రతిరోజు విద్యార్థులు మొలకలు తినాలని ముఖ్యంగా విద్యార్థులు ప్రతిరోజు బెల్లంతో పల్లీలతో నువ్వులతో చేసిన పదార్థాలను తీసుకోవాలని పల్లీలు నువ్వులు బెల్లం తో చేసిన ఆహార పదార్థాలను తీసుకోవడం వలన విద్యార్థులు శారీరికంగా చాలా శక్తివంతంగా తయారవుతారని బయట దొరికేటువంటి గడువు ముగిసిన చిప్స్ దాదాపు ప్లాస్టిక్ కు సమానమైనటువంటి ఆహార పదార్థాలను విద్యార్థులు తీసుకోవడం ద్వారా రాదున్న రోజులలో వారి ఆరోగ్యం దెబ్బతినే అవకాశం ఉంది చదువులో మంచి ఏకాగ్రతను చూపగలుగుతారని మంచి ఫలితాలు సాధించగలుగుతారని ప్రధానోపాధ్యాయుడుఆవుల రవి అన్నారు.



# సెమీ క్రిస్మస్ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు



**తొలి అక్షరం/నర్సంపేట, డిసెంబర్ 21:** నర్సంపేట పట్టణ 5వ వార్డు లో గల చర్చిలో ఘనంగా క్రీస్తు ముందస్తు పుట్టిన రోజు వేడుకలు సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నకాంగ్రెస్ పార్టీ నాయకులునర్సంపేట పట్టణానికి చెందిన సర్వాపురం 5వ వార్డులో రాత్రి జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథు లుగా పాల్గొని కేక్ కటింగ్ చేసి సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసిన 5వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్నం నరసి ంహారెడ్డి,5వ వార్డు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కొప్పు అశోక్,5వ వార్డు యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎడ్ల మధుకర్

# బహుజన పలకరింపు గోర్కటి హనుమంతు యాది సభలో బిఎస్పీ పార్టీ నాయకులు బుర్రి సాగర్,శ్రీకాంత్



**తొలి అక్షరం/నర్సంపేట, డిసెంబర్ 21:**నర్సంపేట నియోజక వర్గం దుగ్గొండి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన గోర్కటి హనుమంతు ఇటీవల అనారోగ్యంతో మరణించడం జరిగింది.పూర్వం మన పూర్వీకులు చేసిన సాంప్రదాయం కడుపు సల్ల అంటే మత్తు పాన్యానికి బదులు ఘన పదార్థాలు పండ్లు డ్రై ఫుడ్ చల్ల ఫ్రూట్స్ మొదలగు వాటిని చనిపోయిన వారి ఇంట్లో వ్యక్తులకి నిద్ర ఆహారాలు సరిగా లేక వారి ఒంట్లో వేడి చేస్తుంది దీనివల్ల మత్తు మాంసం ఇచ్చినట్టయితే మరింత అనారోగ్యానికి గురి కావడం జరుగుతుంది దానికి బదులు వేల సంవత్సరాల నుండి బుద్ధ భగవానుని సమయంలో ఎటువంటి ఆశరమైతే చేశారు అదే ఆచారాన్ని ఫ్రూట్స్ డ్రైఫ్రూట్స్ మజ్జిగతో విటమిన్ సి లాంటివి ఇవ్వడం వలన వారు తొందరగా ఆరోగ్యం మెరుగవుతుంది దీనినే బహుజన పలకరింపు కార్యక్రమం గత కొన్ని సంవత్సరాలుగా రఘుపతి సార్ చేస్తున్న సంగతి తెలిసిందే ఈ కార్యక్రమం ప్రజలకు మంచి మెసేజ్లు ఆరోగ్యమును ఇచ్చే ఘన పదార్థాలను ఇచ్చి కుటుంబాన్ని ఓదార్చే ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు ప్రజల మన్నులు పొందుతున్న సాంప్రదాయ గొప్పది అంటున్నారు ఈ కార్యక్రమంలో రఘుపతి సార్ ఇసాక్ సంఘాల మనోజ్ శివ చందు సిద్దు తదితరులు పాల్గొన్నారు

# మహాకవి శ్రీ గుఱ్ఱం జాషువా అవార్డు గ్రహీత డా.కావూరి శ్రీనివాస్ శర్మ



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),డిసెంబర్21:** సాహి త్య, పరిశోధనా రంగాలలో 44 సంవత్సరాల ఆయుర్వేద రంగ ంలో 25సంవత్సరాల అనుభవంతో ఇప్పటివరకు 30గ్రం థాలను రచించి మన తెలుగు సాహిత్యానికి తెలియని ఎన్నో ప్రాచీన తాళపత్ర గ్రంథాలను సేకరించి పరిష్కరిస్తున్న కావూరి శ్రీనివాస్ శర్మ కి,ప్రతిష్టాత్మక మహాకవి శ్రీ గుఱ్ఱం జాషువా క్యాష్ అవార్డు లభించింది.అంతేకాకుండా సినిమా నటనా రంగం లో వీరి ప్రతిభను కనుగొని కొప్పరపు మహాకవులు పీఠం వ్యవస్థాపకులు శ్రీ మా శర్మ,నవ సాహితీ అంతర్జాతీయ సంస్థ అధ్యక్షులు శ్రీ సూర్య ప్రకాశ రావులు వీరిని వాళ్ళ సంస్థల ద్వారా కావూరి నీ నిన్న హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఘనంగా సన్మానించారు.ఎంతో కన్నుల పండుగగా జరిగింది. దీనికి మాజీ మంత్రి బాబు మోహన్,టీ.గౌరీ శంకర్,జడ్జి మాల్యాద్రి లు కూడా హాజరయ్యారు.వీరి కృషిని కొనియాడారు.

# ఖబర్దార్ అంబేద్కర్ ద్రోహుల్లారా..మారు మ్రోగిన మానుకోట..!!

**● మాటలను వెనక్కి తీసుకోవాలని, భారీ నిరసన ర్యాలీ... ● కిసాన్ పరివార్ సీఈఓ డాక్టర్ వివేక్..**





**తొలి అక్షరం/నెల్లికుదురు, (మహబూబాబాద్) డిసెంబర్ 21:** ఖబర్దార్ అంబేద్కర్ ద్రోహుల్లారా, ఖబర్దార్ అంటూ మారుమ్రోగిన మానుకోట.శనివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కేంద్ర మంత్రి అమిత్ షా అంబేద్కర్ ను కించపరుస్తూ మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోవాలని భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.మద్దతు తెలియజేసినదళిత,గిరిజన ప్రజావిద్యార్థి సంఘాలు అంబేద్కర్ ను అవమానించిన అమిత్ షా ను బర్త్ రఫ్ చేయాలని, అదే విధంగా అతని పై ఎస్సి ఎస్టీ కేసు నమోదు చేయాలని,మతోన్మాదుల నుండి దేశాన్ని రక్షించుకోవాలని సామాజిక దళిత, గిరిజన,ప్రజా,విద్యార్థి సంఘాల నేతల ఆధ్వర్యంలో కిసాన్ పరివార్ సభ్యుడు (ఎల్ ఎస్ ఓ) జిల్లా అధ్యక్షులు గుగులోతు శివవర్మ నాయక్ అధ్యక్షతన జరిగిన ర్యాలీ నిర్వచించారు.రాజ్యాంగ నిర్మా త అంబేద్కర్ పై కేంద్ర హొంమంత్రి అమిత్ షా చేసిన అవమానకరవ్యాఖ్యలపై తక్షణమే చర్యలుతీసుకోవాలని, అంబేద్కర్ విగ్రహం వద్ద సామాజిక ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు అంబేద్కర్ చిత్ర పటాలు చేబూని భారీ నిరసన చేపట్టారు,అమిత్ షా ఖబడ్దార్ , అంబేద్కర్ జిందాబాద్, రాజ్యాంగం వర్ధిల్లాలి, అంటూ నినాదాలతో మానుకోట పట్టణంలో మార్మోగించారు.. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు.సామాజిక ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ లో ముఖ్య అతిథిగా హాజరైన కిసాన్ పరివార్ సీఈఓ డాక్టర్ వివేక్ మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పై అమిత్ షా అహంకారపూరితమైన తిరస్కార స్వరంతో, అమిత్ షా మాట్లాడడం తన అహంకారాన్ని రుజువు చేసిందన్నారు, భారతదేశ లౌకిక, ప్రగతిశీల రాజ్యాంగ రూపశిల్పి పైన చూపిన అగౌరవాన్ని, అపహాస్యం చేయడానికి ప్రయత్నించారని విమర్శించారు.ఈ అవమా నకరమైన వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ హొం మంత్రి అమిత్ షా రాజీనామా చేయా లని,క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ వ్యాఖ్యలు కేవలం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పైన చేసినవి మాత్రమే కాదని,సామాజిక న్యాయం కోసం పోరాటాన్ని కొనసాగిస్తున్న లక్షలాది మంది అణగారిన వ్యక్తులకు జరిగిన అవమానమన్నారు, తక్షణమే అతన్ని బర్తరఫ్ చేయాలన్నారు. భారత రాజ్యాంగంపై బీజేపీ చేస్తున్న దాడికి వ్యతిరేకంగా భారత ప్రజల నుంచి పెరుగుతున్న ప్రతిఘటన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేశారన్నారు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ హిందూత్వ శక్తులచే నిరంతరం దాడికి గురవుతున్న భారత రాజ్యాంగంలో పొందు పరచబడిన నిశ్చయాత్మక చర్యల నిబంధనల పరిరక్షణ కోసం పోరాడటానికి లక్షలాది మందిని ప్రేరేపించారని చెప్పారు.. భారత ప్రజలపై మనువాద భావజాలాన్ని రుద్దేందుకు ఈ శక్తులు అవిశ్రాంతంగా పని చేస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో దళిత,గిరిజన,ప్రజా సంఘాల,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నేతలు మహమ్మద్ ఫరీద్, సీనియర్ జర్నలిస్టు డి వై గిరి,ఎల్ హెచ్ పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుగులోతు భీమా నాయక్, కిషన్ నాయక్,నీరుడు సమేల్, కన్నా,విద్యార్థి జన సమితి మనోజ్,లు మద్దతు పలికి మాట్లాతూ,అమిత్ షా బిజెపి పార్టీ వారి ఆలోచనలు కులతత్వంతో ఉన్నాయని,రాజ్యాంగం పట్ల నిజమైన గౌరవం లేదని ఇది మరోసారి రుజువయిందన్నారు.ఎన్నికల సమయంలోనే కాకుండా ఆర్ఎస్ఎస్ ,బిజెపి తరచుగా వ్యక్తం చేసే అసహనం, భారతదేశంలో సామాజిక న్యాయం , సమానత్వం కోసం డాక్టర్ అంబేద్కర్ పోరాడి నడిపిన ఉద్యమాలు మరియు ఆదర్శాల పట్ల వారి లోతైన ద్వేషాన్ని వెల్లడిస్తుందన్నారు.. మతోన్మాదుల నుండి దేశానికి ప్రమాదం పొంచి ఉందని అమిత్ షా విద్వేషాలకు కారకుడని విమర్శించారు. తక్షణమే అమిత్ షా ను బర్తరఫ్ చేయాలని చేసే వరకు ఉద్యమాలను కొనసాగిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కిసాన్ పరివార్ సభ్యులు విష్ణు నాయక్, గోర్ సేన బిచ్చు నాయక్,హరి నాయక్,ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా నేతలు శ్రీను నాయక్, హెల్ ఎస్ ఓ జిల్లా నాయకులు గుగులోతు వెంకటేష్ నాయక్,బానోతు జవహర్లాల్ నాయక్, కిసాన్ పరివార్ టీమ్ సభ్యులు ఎడలి వెంకన్న, గణేష్, వెంకటేశ్వర్లు, రామ్మూర్తి,రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# అరవింద పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి(పి.సైదులు),డిసెంబర్21 :** ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ 137వ జయంతిని పురస్కరించుకొని నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేటలో గల అరవింద పబ్లిక్ స్కూల్ లో ప్రిన్సిపాల్ పంచకం రమాదేవి ఆధ్వర్యంలో శనివారం ముందస్తుగా జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కరస్పాండెంట్ పంచకం నర్సయ్య విద్యార్థులు తయారు చేసిన గణిత ఎగ్జిబిట్స్ ను ఉపాధ్యాయ బృందంతో కలిసి పరిశీలించారు. వారు తయారు చేసిన ఎగ్జిబిట్స్ గురించి విద్యార్థులు వారి అభిప్రాయాలను, అవి పనిచేసే విధానాన్ని చాలా చక్కగా వివరించారు. అనంతరం జరిగిన సమావేశంలో పంచకం నర్సయ్య మాట్లాడుతూ గణిత శాస్త్రంలో శ్రీనివాస రామానుజన్ సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయన పుట్టిన రోజు డిసెంబర్ 22 ను జాతీయ గణిత దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. చిన్నతనంలోనే రామానుజన్ గణిత శాస్త్రంలో త్రికోణమితి, సమీకరణాలు, సర్వ సమీకరణాలు, ఇన్ఫినిటీస్, ఆల్జీబ్రా, జామెట్రీ లాంటి క్లిష్టమైన గణిత సూత్రాలను అవలీలగా, సులభమైన రీతిలో తెలిపి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు దక్కించుకున్న మేధావి అని అన్నారు. విద్యార్థులు గణిత మెలుకువలను తెలుసుకొని గణిత శాస్త్రంలో పట్టు సాధించాలని సూచించారు. ఎగ్జిబిట్స్ తయారుచేసిన విద్యార్థులను, వారిని ప్రోత్సహించిన గణిత ఉపాధ్యాయురాలు కె దివ్యశ్రీని ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాల్లు ఎ నర్మద, కె దివ్య శ్రీ, యాస్మీన్, కె రజిత, ఎ సుష్మిత, సిమ్రాన్, స్పందన, జె స్వప్న, ఆఫ్రీన్, విద్యార్థినీ విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రజాస్వామ్య పరిపాలనపై అవగాహన సదస్సు

**● వికాస్ హైస్కూల్ కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) డిసెంబర్ 21:** విద్యార్థులకు ప్రజాస్వామ్య పరిపాలన ఓటు హక్కు వినియోగం నాయకత్వ లక్షణాలు వంటి అంశాలపై అవగాహన కల్పించామని వికాస్ హై స్కూల్ కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్ తెలిపారు. తొర్రూర్ పట్టణ కేంద్రంలోని వికాస్ హై స్కూల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం ఎలక్షన్స్ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వికాస్ హై స్కూల్ కరస్పాండెంట్ తాళ్లపల్లి రమేష్ పాల్గొని ఆయన మాట్లాడుతూ...గత ఐదు రోజుల నుండి ఎలక్షన్ నోటిఫికేషన్ రిలీజ్ చేయడం,అలాగే నామినేషన్స్,వాటి ఉపసంహరణ నిర్వహించడం జరిగింది అని తెలిపారు.విద్యార్థులు నాలుగు పార్టీలుగా విభజింపబడి బ్యాట్,పెన్సిల్, ఉదయించే సూర్యుడు, పుస్తకం వంటి గుర్తులతో ప్రచారాన్ని ముగించుకొని ఓటింగ్ ని ప్రారంభించారని అన్నారు.విద్యార్థుల ఉత్కంఠత, ప్రచారపు హొరు, ఆ తర్వాత నామినేషన్స్, ఓటింగ్ విధానం పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధంగా బ్యాలెట్ పేపర్ విధానంలో నిర్వహించడం జరిగింది అని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో, ఆనందంతో నిజమైన ఎలక్షన్స్ లాగా ఫీల్ అయి ఓటింగ్ సరళిలో పాల్గొన్నారు. ప్రజాస్వామ్య విధానంలో ఓటు హక్కు ఎంతో ముఖ్యమైనదని దాని ద్వారా భవిష్యత్తుకు కావలసిన అవసరాలను తీర్చుకోవడానికి నాయకుడిని ఎన్నుకునే అవకాశం దొరుకుతుందని అన్నారు.పాఠశాల డైరెక్టర్ లు కె.వి.రెడ్డి, విజయభాస్కర్, ప్రిన్సిపల్ వేణుమాధవ్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నాగరాజు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# యువత మాదక ద్రవ్యాల నుంచి దూరంగా ఉండాలి

**● తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలి ● పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్ఛార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ) డిసెంబర్ 21:** యువత మాదక ద్రవ్యాల నుంచి దూరంగా ఉండాలని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు.శనివారం హైదరాబాద్ లోని నెక్లెస్ రోడ్డు జలవిహార్ దగ్గర నిర్వహించిన డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ 2కే రన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ.డ్రగ్స్ మానవ జీవితాలను ఎలా నాశనం చేస్తున్నాయో వివరించారు.అవి వ్యక్తిగత జీవితానికే కాకుండా సమాజానికి కూడా పెనుముప్పుగా మారతాయని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలని సూచించారు. డ్రగ్స్ సరఫరా చేయించే ముఠాలు, అక్రమ వ్యాపారులకు వ్యతిరేకంగా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని అన్నారు.పోలీస్ శాఖ, ఎక్సైజ్ శాఖ సహా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.డ్రగ్స్ గురించి ప్రజలకు అవగాహన కల్పించడం సమాజంలోని ప్రతి పౌరుని బాధ్యత అని చెప్పారు. విద్యార్థులు, యువకులు, నిర్వాహకులు, ప్రముఖులు పాల్గొన్నారు.





# సమాజ సేవలో జర్నలిస్టులు పాత్ర కీలకం

**- సిఐలు శ్రీధర్ రావు, కర్ణకర్**

**- సిఐలను మర్యాద పూర్వకంగా కలిసిన తొలి అక్షరం ఎడిటర్ పస్తం సైదులు**

**తొలి అక్షరం/రాష్ట్ర ప్రతినిధి పి సైదులు),డిసెంబర్21:** సమాజ సేవలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైందని సిఐ లు శ్రీధర్ రావు,కర్ణకర్ లు అన్నారు. శనివారం హన్మకొండ ఎస్పీ కార్యాలయంలో సిఐ లు శ్రీధర్ రావు,కర్ణకర్ లను తొలి అక్షరం ఎడిటర్ పస్తం సైదులు మర్యాద పూర్వకంగా కలిశారు.

# వికలాంగుల కళాకారులకు సమాన అవకాశాలు కల్పించాలి

**● వికలాంగులు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి ● సాంస్కృతిక ఉత్సవాల్లో తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ ఆనందచారి**



**తొలి అక్షరం/హైదరాబాద్, డిసెంబర్ 21:** వికలాంగుల కళాకారులను ప్రోత్సాహించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని,సమాన అవకాశాలు కల్పించి వికలాంగుల కళాకారులను ముందుకు తీసుకువెళ్లాలని తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ ఆనందచారి అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, LIC సౌజన్యంతో వికలాంగుల రాష్ట్ర స్థాయి సాంస్కృతిక ఉత్సవాలు రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్ అధ్యక్షతన జరిగాయి.వికలాంగుల కళాకారులూ చేసిన నృత్యాలు, పాటలు, డాన్స్, మిమిక్రి ఆకట్టుకున్నవి.ఆనంద చారి మాట్లాడుతూ సకలాంగులకు దిటుగా వికలాంగులు ముందుకు వస్తున్నారని అన్నారు. వికలాంగుల్లో ఉన్న ఆత్మవిశ్వాసం చాలా గొప్పదని అన్నారు. వైకాల్యం శరీరానికే తప్ప ప్రతిభకు కాదని అన్నారు.సామజిక అసమానతలపై వికలాంగులు చైతన్యం కావాలని అన్నారు.స్టిఫెన్ హాకింగ్ అంగవైకల్యం ఉన్న ప్రపంచంలోనే ఉన్నత శ్రేణి శాస్త్ర వేత్త అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సాంస్కృతిక సారధిలో వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఆలోచనలు చేయలేని వల్లే నిజమైన వికలాంగులని అన్నారు. వైకాల్యం ఉందని కుంగిపో కూడదని, పట్టుదలతో అంగవైకల్యాణ్ణి అదిగమించాలని అన్నారు.శ్రమా నుండే పాట పుట్టిందని అన్నారు.పాటలు వికలాంగులలో చైతన్యం నింపాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్యా, రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, NPRD మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ సాయమ్మ, NPRD సాంస్కృతిక విభాగం రాష్ట్ర కన్వీనర్ ఎరపుల జంగయ్య, రాష్ట్ర ఉపాధ్య క్షలు యశోద, దశరథ్, ఉపేందర్,స్వామి, లింగన్న , సహాయ కార్యదర్శులు కొనింటి నర్సిము లు, యేశాల గంగాధర్, బాలిశ్వర్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి శశికల,ప్రకాష్, శేఖర్ గౌడ్, దుర్గ, చంద్రమో హన్, లలిత,బాలయ్య, సుల్తాన్ రమేష్,లతో పాటు జిల్లాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్రిస్మస్ మెగా సెలబ్రేషన్...

**తొలి అక్షరం/మంథని:** మంథని మండలం సూరయ్య పల్లి లోని మేరీ మీడియా ట్రిక్స్ హైస్కూల్ ఈరోజు పెద్ద ఎత్తున క్రిస్మస్ పండుగ సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పిల్లలు పలు సాంస్కృతిక కార్యక్రమాల లో పాల్గొన్నారు. పలు రకాల డ్యాన్సులతో అలరించారు. ఏసుక్రీస్తు జన్మ రహస్యాన్ని సంబంధిత పాత్రలు, వేషధారణలతో చాలా సంబరంగా ఈ ఉత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో మంథని లో ని నలుగురు నాయకులు, సూరయ్యపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

